విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 21, నవంబరు 2025

చిన్నారులకు అస్వస్థత

విశాలాంధ్ర బ్యూరో– నంద్యాల : జిల్లాలోని పాములపాడు మండల పరిధిలో గల మిట్టకందల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో ఎనిమిది మంది చిన్నారులు మధ్యాహ్నం అంగన్వాడి సెంటర్లో చేసిన ఆహారాన్ని తిని ఇంటికి వెళ్లిన చిన్నారులు అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే తల్లిదండ్రులు పిల్లలను బుధవారం ఉదయం అంగన్వాడి వద్ద విడిచిపెట్టి పనులకు వెళ్లారు. మళ్లీ తిరిగి వచ్చే సమయానికి పిల్లలు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు గమనించారు. వెంటనే ఆందోళన చెందిన తల్లిదండ్రులు చిన్నారులను చికిత్స కోసం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రులకు తరలించారు. నలుగురు చిన్నారులను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి, ముగ్గురిని ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వామిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అస్వస్థతకు గురైన పిల్లల వివరాలు : సంపంగి రితిక, సురేంద్ర, ఋషి, నిశ్చిత్ , సురేంద్ర, కృష్ణ, దేవేంద్రన్న ఈ చిన్నారులందరికీ నాలుగు సంవత్సరాలలోపు వయస్సు గల చిన్నారులేనని తల్లిదండ్రులు తెలిపారు. ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు మాట్లాడుతూ చిన్నారులు కలుషిత ఆహారం లేదా కలుషిత నీరు తాగడం వల్ల ఈ అస్వస్థతకు గురై ఉండవచ్చు అన్నారు. ప్రస్తుతం అందరికీ మెరుగైన చికిత్స అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఆహార, నీటి నమూనాలను పరిశీలన కోసం ల్యాబ్ కు పంపించడం జరిగిందని అని సంబంధిత అధికారులు తెలిపారు. చిల్డ్రన్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి మాట్లాడుతూ మిట్టకందల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో జరిగిన ఈ ఘటనలో చిన్నారులకు సమయానికి వైద్య సేవలు అందించడం వల్ల ఇప్పుడు అందరూ సురక్షితంగా ఉన్నారు అని వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో అధికారులు ఆహార లోపం వలన జరిగిందా లేదా కలుషిత నీరు వల్ల జరిగిందా అనే విషయంపై విచారణ ప్రారంభించారు. అనంతరం అస్వస్థతకు గురైన చిన్నారుల తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ఆహార సరఫరా నిల్వ విధానాలపై సంబంధిత అధికారులు కఠిన పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు. అంగన్వాడి కేంద్రాల నిర్లక్ష్యంతో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న మా చిన్నారులకు ఏమైనా జరుగుతే బాధ్యత ఎవరిది అంటూ ఘాటుగా అధికారులను ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రంలో ఆహార లోపంతో ఆత్మకూరు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని తల్లిదండ్రులు మీడియా ద్వారా తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యం పదిలం

జిల్లాలోని మిట్ట కందాల గ్రామ మూడవ అంగన్ వాడి కేంద్రంలో బుధవారం సాయంత్రం ఎనిమిది మంది చిన్నారులు అస్వస్థతకు గురి కావడంతో వైద్య చికిత్సలు అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గురువారం తెలిపారు. చిన్నారుల ఆరోగ్యం స్థిరంగా ఉండడంతో వారందరినీ కూడా హాస్పిటల్ నుండి తమ ఇళ్లకు పంపడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో అంగన్వాడి కేంద్రానికి సరఫరా చేసే ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్ పరీక్షలకు పంపించామని, సంబంధిత రిపోర్టులు అందవలసి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మంజూరు చేసిన పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో దిశ కమిటీ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎంపీపీలు, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో వినియోగించుకోకపోవడంతో వందల కోట్లు వెనక్కి వెళ్ళిపోవడం బాధాకరమన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాల అమలును పటిష్టవంతంగా చేపట్టి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. జల్ మార్గ్ వికాస్ ప్రాజెక్ట్ కింద జిల్లాను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని, శ్రీశైలానికి వెళ్లడానికి సింగిల్ రోడ్డు మార్గం ఉండడం వల్ల అక్కడికి చేరుకోవడానికి చాలా సమయం పడుతుందని, అలా కాకుండా జల్ మార్గ్ వికాస్ ప్రాజెక్ట్ ద్వారా సంగమేశ్వరం నుండి శ్రీశైలం వరకు బోటు మార్గం ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా పర్యాటకపరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని దిశా కమిటీ ఛైర్మన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు.

ముత్యాలపాడు నామినేషన్లు ఎలా..!

కేంద్రానికి రాని ఎన్నికల అధికారి

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు పాలడైరి సొసైటీకి ఖాళీ ఏర్పడ్డ రెండు డైరెక్టర్ల స్థానానికి గురువారం నామినేషన్ల ప్రక్రియ జరగవలసి ఉంది. అయితే స్థానిక కేంద్రం వద్దకు ఉదయం నుంచి నిర్ణీత సమయం మధ్యాహ్నం 2 గంటల వరకు సంబంధిత ఎన్నికల అధికారి రాకపోవడంతో ఎలాంటి నామినేషన్ జరగలేదు. సంబంధిత అధికారి సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం ముత్యాలపాడు పాల డైరీ నామినేషన్ ప్రక్రియ ఎలా అన్న సందిగ్ధం నెలకొంది. వాయిదా పడ్డాయా.. ఇంతటితో నిలిపేస్తారా అన్న విషయం తెలియాల్సి ఉంది.

డోర్ టు డోర్ చెత్త సేకరణ

విశాలాంధ్ర – బనగానపల్లె రూరల్: మండల పరిధిలోని మిట్టపల్లె గ్రామంలో హరిత రాయబారుల (గ్రీన్ అంబాసిడర్) డోర్ టు డోర్ చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో బాల ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ యడమకంటి తులసి రెడ్డి గురువారం ఉదయాన్నే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గ్రామ ప్రజలతో మమకమై హరిత రాయబారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ఇంటిలోని చెత్తను చెత్త వాహనాల్లో మాత్రమే వేయాలని సూచించారు. ఇంటితోపాటి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ హైమావతి, వడిసెల రామ సుబ్బారెడ్డి, యన్నం వెంకటసుబ్బారెడ్డి, మహిళలు రత్నాలు, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాసాలో ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీ చైతన్య

విశాలాంధ్ర – నందికొట్కూరు : నందికొట్కూరు శ్రీ చైతన్య పాఠశాల నందు నాసా (నేషనల్ స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్)లో పాల్గొని గత కొన్నేళ్లుగా అనేక విజయాలు సాధించి ప్రపంచ ఛాంపియన్గా శ్రీ చైతన్య స్కూల్ నిలిచిందని, ఆర్ఐ కోటయ్య చౌదరి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీలో గెలుపొందిన విద్యార్థులు తమ ప్రాజెక్టు ప్రదర్శించడానికి అమెరికాలో జరిగే ఐఎస్‌డిసి (ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్మెంట్ కాన్ఫరెన్స్)కు హాజరయ్యే అవకాశం లభించనుందని తెలిపారు. పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మకతను, టీం వర్క్‌ను ప్రోత్సహించడానికి, పోటీలో పాల్గొనడం ద్వారా అంతర్జాతీయ గుర్తింపు పొందుతారన్నారు. అనంతరం నాసా విద్యార్థులకు నాసా కిట్స్ పుస్తకాలు, టీషర్ట్స్ ,పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్ ఏజీఎం సురేష్, ,ప్రిన్సిపల్ దీప, కోఆర్డినేట్ రమణయ్య, డీన్ ఉమామహేశ్వరరావు, ఏవో గోపాల్ రెడ్డి, నాసా ఇంచార్జ్ గోపాల్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌పీసీ చైర్మన్‌గా ఎర్రగొండ చందు

విశాలాంధ్ర – బనగానపల్లె రూరల్: నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఎన్ హెచ్ఆర్‌పీసీ) బనగానపల్లె నియోజ కవర్గ యూత్ చైర్మన్‌గా బనగానపల్లెకి చెందిన ఎర్రగొండ చందు ఎంపికయ్యారని ఎన్‌హెచ్‌ఆర్‌పీసీ సంస్థ నేషనల్ చైర్మన్ ఆర్ కంబగిరి స్వామి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్రగొండ చందు విద్యార్థి లీడర్‌గా ఎన్నో సేవలందించారని, పలు విద్యార్థుల సమస్యలను బస్సు సౌకర్యం లేని గ్రామాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సులు వేయాలని పలుమార్లు పోరాటం చేసి ఎంతోమంది విద్యార్థులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అతను చేసినటువంటి కార్యక్రమాలు విద్యార్థి దశలోనే లీడర్‌గా సేవలందించడంలో ప్రధాన పాత్ర పోషించారని వారి సేవలను గుర్తించి నేషనల్ హ్యూమన్ రైట్స్ సంస్థలో నియోజకవర్గ యూత్ విభాగం చైర్మన్‌గా ఎంపిక చేశామ న్నారు. ఇందులో భాగంగా సంస్థ యొక్క నియమ నిబంధనలతో మానవ హక్కుల అవగాహనపై పౌరులకు విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్ బృందం పర్యటన

విశాలాంధ్ర – నందికొట్కూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై 19వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతుందని ఏపీవో అలివేలు మంగమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలియజేస్తూ నందికొట్కూరు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ చేసినందుకు ఆడిట్ బృందం రావడం జరిగిందని వారు నేటి నుంచి అన్ని గ్రామాలకు వెళ్లి కూలీలు చేసిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేయడం జరుగుతుందని కాబట్టి గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు, మెట్లు సిద్ధంగా ఉండాలని సూచించారు.

నీటిలో పడి పాడిరైతు మృతి

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలంలోని నగళ్ళపాడు గ్రామ శివారులో గల భవనాసి వాగులో ప్రమాదవశాత్తు రైతు రామసుబ్బరాయుడు (60) జారి పడి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు తన గేదెలను మేపుకునేందుకు పొలానికి తీసుకెళ్ళాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయాన గేదెలు భవనాసి నీటిలో దిగడంతో వాటిని తోలేందుకు వెళ్ళి ప్రమాదవశాత్తు జారి నీటి గుంతలో పడి మృతి చెందాడు. గేదెలు ఇంటికి వచ్చిన రామసుబ్బరాయుడు రాకపోవడంతో భార్య రామసుబ్బమ్మ,కుటుంబీకులు భవనాసి సమీపంలోకి వెళ్ళి గాలింపు చేసారు. కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సురేష్,తహసీల్దారు విజయ్‌కుమార్, పోలీసులు భవనాసి వద్దకు చేరుకుని గాలింపు చేయగా నీటి కుంటలో మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని బయటకు తీసారు. గేదెలు మేపుకునేందుకు వెళ్ళి మృత్యువాతకు గురి కావడంతో భార్య,కుటుంబీకులు కన్నీటిపర్యంతం అయ్యారు. కుటుంబీకుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

భాస్కర్ మృతి తీరని లోటు

విశాలాంధ్ర–డోన్ : ఏఐటీయూసీ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందడం ఏఐటీయూసీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య అన్నారు. గురువారం భాస్కర్ మృతదేహానికి పూలమాలలు వేసి ఏఐటీయూసీ జెండా కప్పి నివాళులరించినవారిలో సీపీఐ కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాధాకృష్ణ ఏఐటీయూసీ డోన్ అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శిలు మోటారాముడు, నారాయణ సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎం.పుల్లయ్య ప్రజానాట్యమండలి సీపీఐ నాయకులు కోయిలకొండ నాగరాజులు ఉన్నారు. సిపిఐ ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ భాస్కరు మృతి చెందడం చాలా బాధాకరమని గత 30 సంవత్సరాల నుండి హమాలీ యూనియన్ లీడర్‌గా అమాలి కార్మిక సమస్యల పట్ల ఎప్పటికప్పుడు కూలి రేట్లు పెంచడంలో కానీ అమాలి సమస్యల పరిష్కారంలో ముందుఉండేవాడన్నారు. ఇలా అనేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించిన అమాలి యూనియన్ ప్రెసిడెంట్ భాస్కర్ మరణం సీపీఐ అలాగే ఏఐటీయూసీకి ప్రధానంగా అమాలి కార్మికులకు తీరని లోటని నాయకులు బాధని వ్యక్తం చేస్తూ భాస్కర్ కుటుంబానికి ఏఐటియుసి,సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు.అంతిమయాత్రలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుంకయ్య,ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి అబ్బాస్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి పుల్లయ్య,హమాలి యూనియన్ నాయకులు సురేష్,మధు, కృష్ణ,సుంకన్న,చంద్ర,అయ్యన్న,రాముడు ఏఐటీయూసీ అనుబంధ అనేకమంది కార్మిక నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

మొక్క జొన్న అగ్నికి ఆహుతి

విశాలాంధ్ర– బనగానపల్లె రూరల్:మండలంలోని యాగంటి పల్లి గ్రామంలోని సచివాలయానికి వెనుక ఉన్న 3 ఎకరాల మొక్క జొన్న పంట దగ్ధం అయ్యింది. వివరాల మేరకు యాగంటి పల్లె లోని సోమన్న గారి రామకృష్ణ రెడ్డి పొలంలో గురువారం సాయంత్రం వేళ నిప్పంటుకుంది. మొక్కజొన్న కోత తర్వాత చెత్తకు నిప్పు పెట్టిన పక్కన పొలం రైతులు అనుకోకుండా ఈదురు గాలులకు ఆ మంటలు పక్కన ఉన్న సోమన్న గారి రామకృష్ణ రెడ్డి పొలానికి వ్యాప్తి చెందాయి. రామకృష్ణ రెడ్డి అందుబాటులో లేక పోవడం వలన పక్క పొలం రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలను అదుపు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడం తో వెంటనే స్పందించిన ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. 3ఎకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధం అవ్వడంతో 40 వేల రూపాయలు పంట నష్టం జరిగిందని రైతు తెలిపారు.

పది పరీక్ష కేంద్రాలు పరిశీలన

విశాలాంధ్ర – ప్యాపిలి : ప్యాపిలి పట్టణంలోని గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికలు ఉన్నత పాఠశాల, మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను డోన్ ఉప విద్యాధికారి వెంకట్రామిరెడ్డి,జిల్లా అసిస్టెంట్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ అధికారి రఘురాం రెడ్డి వారు పరిశీలించారు. వచ్చే సంవత్సరం – 2026 మార్చిలో జరగనున్న పదవ తరగతి పరీక్షల కోసం పాఠశాలలో వసతులు సౌకర్యాలపై పాఠశాల ప్రధానోపాధ్యాయులతో ఆరా తీయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100శాతం ఉత్తీర్ణత సాధించేలా 100 రోజుల ప్రణాళిక డిసెంబర్ నెలలో ప్రారంభమవుతుంది అని, అలాగే డిసెంబర్ 05 లోపు సిలబస్ పూర్తి చేసి రివిజన్ టెస్టుకు విద్యార్థులను సన్నదం చేయాలని ఉపాధ్యాయులకు వారు ఆదేశించారు.మండల విద్యాధికా రులు వెంకటేశ్వర నాయక్, మహేశ్వర్ రెడ్డి, సిఆర్పి రామాంజ నేయులు పాల్గొన్నారు.

చురుగ్గా బీటీ రోడ్డు నిర్మాణ పనులు

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : మండలంలోని ఇటిక్యాల, ఉమ్మాయి పల్లె రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటిక్యాల నుండి చింతలయపల్లి అబ్దుల్లాపురం కోరుమాని పల్లి, తోలమడుగు మీదుగా ఉమ్మాయిపల్లి వరకు దాదాపు 8 కిలోమీటర్ల మేర తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇటిక్యాల నుండి ఉమ్మాయిపల్లెకు దాదాపు 13 కిలోమీటర్ల దూరం ఉండగా, ఆయా గ్రామాలలో సిమెంట్ రోడ్లు, అక్కడక్కడ బ్రిడ్జిలు, కల్వర్టుల దూరం మినహాయించి మిగిలిన తారురోడ్డు నిర్మాణ పనులు రెండు వారాల నుండి చేపట్టారు. గతంలో వేసిన తారు రోడ్డు గుంతలమయం కావడంతో పాటు దెబ్బ తినడంతో ప్రభుత్వం కొత్త తారు రోడ్డును నిర్మిస్తున్నది. ఇప్పటికే ఎనిమిది కిలోమీటర్ల మేర దెబ్బతిన్న తారు రోడ్డును తొలగించి కంకర పరిచారు. ఉమ్మాయిపల్లి నుండి తారును కూడా పరుస్తుండడంతో త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. మూడు జిల్లాల సరిహద్దుల్లోని ఉమ్మాయిపల్లి వైపు ఉండే గ్రామాల ప్రజలు అంకిరెడ్డిపల్లి వైపు నుండి కాకుండా మండల కేంద్రమైన కొలిమిగుండ్ల కు నేరుగా చేరుకోవచ్చు.

ఇంటి స్థలాల కోసం మంత్రికి వినతి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి అర్హులైన టీవీ టెక్నీషియన్స్‌కు ఇళ్లస్థలాలు కేటాయిం చమని కోరారు. టీవీ టెక్నీషియన్స్‌కు మెప్మా ద్వారా శిక్షణ ఇప్పించాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, మెప్మా ద్వారా రుణాలు అందజేయడానికి సహకరిం చాలని జిల్లా టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, అధ్యక్షులు కన్నయ్య, నంద్యాల పట్టణ టీవీ టెక్నీషియన్స్ సంఘం అధ్యక్షులు జయపాల్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అర్హులైన వారికి తప్పనిసరిగా ఇల్లు లేదా ఇంటి స్థలాలు కేటాయించి సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టెక్నీషియన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట శివయాదవ్, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎల్లాగౌడ్, కోశాధికారి వీరారెడ్డి, సహకోశాధికారి కిషోర్ కుమార్, గౌరవాధ్యక్షులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నిధులతో పోలీస్ శాఖకు బొలెరో నియో వాహనం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణ కోసం జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌కు ఒక బొలెరో నియో వాహనాన్ని తన ఎంపీ నిధులతో అందజేయడం జరిగిందని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎంపీ బైరెడ్డి శబరి లాంచనంగా జెండా ఊపి బొలెరో నియో వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు సహాయం అందించడానికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని, ప్రజా భద్రతను మెరుగుపచడానికి, పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ఈ వాహనాన్ని అప్పగించామన్నారు. ఈ వాహనం ప్రత్యేకంగా పెట్రోలింగ్, చిన్న పిల్లలు, మహిళల భద్రత, అత్యవసర కాల్‌ల కోసం ఏర్పాటు చేయబడిందన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర – రుద్రవరం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రుద్రవరం మెయిన్ స్కూల్ హెడ్మాస్టర్ లింగమ్మ, స్పెషల్ స్కూల్ హెడ్మాస్టర్ ఉమామహేశ్వరి, ఆర్ నాగులవరం ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ సుదర్శన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో జరిగిన58 వ గ్రంథాలయం వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. గ్రంథాలయ అధికారి జి.శౌరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరిగాయన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పరుగు పందెం, మ్యూజికల్ షేర్స్, వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మావతమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర–పాణ్యం : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 14 తేదీ నుండి 20వ తేదీ వరకు శాఖ గ్రంథాలయము పాణ్యం నందు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా గురువారం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాణ్యం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్,ఎంపీటీసీ రంగ రమేష్ ,పాణ్యం మండల తెలుగుదేశం కన్వీనర్ రాంపుల్లారెడ్డి ,డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ శోభారాణి,ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్ బాబు, మండల విద్యాధికారి సుబ్రహ్మణ్యం ,రిటైర్డ్ ఉద్యోగస్తులు ,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర–కోవెలకుంట్ల: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పంచే బండాగా రాలని కోయిలకుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని వాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంధాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రంథాలయాలు తరతరాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక, వాటిని ఉపయోగించి ఆధునిక నాగరికతను నిర్మించాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయ అధ్యాపకులు కేవి రమణారెడ్డి మాట్లాడుతూ గాడిచర్ల హరి సర్వోత్తమ రావు, అయ్యంకి వెంకట రమణయ్య, సిపి.బ్రౌన్ మొదలగు వారు గ్రంథాలయోద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర రెడ్డి, భాస్కర రెడ్డి, రామసుబ్బారెడ్డి, కృష్ణ దాసు, సంటి రెడ్డి, నరేంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ లక్ష్మీదేవి, అన్నపూర్ణ, భాస్కర్ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు వెళ్లడం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర – అవుకు: ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాల యాలకు వెళ్లడం అలవర్చుకోవాలి అని మండల విద్యాధికారి శ్రీధర్ రావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.రామదాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మండల విద్యాధికారి శ్రీధర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందించారు. గ్రంథాలయాధికారి పి.రామదాసు మండల విద్యాధికారి శ్రీధర్ రావును, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుబ్బయ్యను, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ప్రత్యూష విజయ్ కుమారి పుష్పావతి భాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగన్న అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంధాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రంథాలయ అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ గంగన్న విద్యార్థులకు గత రెండు రోజులుగా వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గంగన్న మాట్లాడుతూ గ్రంథాలయాలు అనేవి యువత జీవితంలో ఎంతో ముఖ్యమైన దిశగా నిలుస్తాయన్నారు. అందువల్ల గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గాయత్రి, విజయలక్ష్మి, నాగ మస్తాన్, కాశీ విశ్వనాథ్, ప్రహ్లాదుడు, డా జయచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం విద్యార్థుల మేధస్సును పెంచుతుంది

విశాలాంధ్ర – వెలుగోడు : పుస్తక పఠనం చేయుట ద్వారా విద్యార్థులు మేధస్సును పెంపొందించుకొనుటకు చక్కని అవకాశం ఉందని వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలిక్ ఖాన్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ శాఖలో గురువారం 58వ జాతీయ వారోత్సవాల ముగింపు వేడుకలు గ్రంథాలయాధికారిని సుమలత ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయ ప్రాముఖ్యతను నేటితరం విద్యార్థులు తెలుసుకోవడం ద్వారా సార్వత్రిక విషయాలను తెలుసుకుంటారు. క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు మహమ్మద్ షైజుల్ల, మోహన్, బలుస రాము,వాసవి క్లబ్ సభ్యుడు నాగరాజు మహిళలు పాటకులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర– ఆత్మకూరు రూరల్ : మండలంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 58వ జాతీయ గ్రందాలంను వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. గ్రంథాలయ అదికారి యన్.రాకేష్ ఆధ్వర్యంలో ఈ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాల విదార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించి. గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విదార్థులు, ఉపాద్యాయులు, పాఠకులు పాల్గొన్నారు.

రహదారికి దూరంగా డంప్ యార్డ్ వ్యర్థాలు

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల పరిధిలోని రుద్రవరం రాస్తా పక్కన ఉన్నటువంటి డంప్ యార్డులోని వ్యర్థాలను రహదారికి దూరంగా తరలించినట్లు ఈవో అశ్విన్ కుమార్ తెలిపారు. ఇటీవల మొంథా తుఫాను ప్రభావం వల్ల డంపులో ఉన్నటువంటి వేస్టేజీ, చెత్తాచెదారం రహదారికి దగ్గరగా రాగా వాటిని జెసీబీ సహాయంతో ప్రజలకు ప్రయాణికులకు ఆసౌకర్యం కలగకుండా దూరంగా తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యం కోసం ఒకవైపు శానిటేషన్ పనులు ముమ్మరం చేస్తూనే మరోవైపు పరిసరాల పరిశుభ్రతకు నిరంతరం కృషి చేస్తున్నామని ఈఓ అశ్విన్ కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర– జూపాడుబంగ్లా :58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎన్ స్రవంతి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విద్యార్థులకు పాఠకులకు సూచించారు. విద్యర్థులకు వ్యాసరచన, క్విజ్,డ్రాయింగ్, వంటి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారిని ఎన్ స్రవంతి బహుమతులు అందజేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 21, నవంబరు 2025

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని నేటి యువత వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. ఈరోజు నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ అప్పటి నాయకులు ఎంతో ముందు చూపుతో యువతకు విద్యతో పాటు, విజ్ఞానాన్ని అందించేందుకు గ్రంథాలయాలు ఏర్పాటు చేశారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాలలో అవసరమైన పుస్తకాలతో, ఈనాటి యువతకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కలిగి ఉన్నాయన్నారు. ముఖ్యంగా గ్రంథాలయాలలో ఇంటర్నెట్, కంప్యూటర్ ల్యాబ్ ల ఏర్పాటుతో కాలానుగుణంగా విద్యార్థులు, యువత ప్రపంచంలో ఎక్కడ ఏమేమి జరుగుతున్నది వెంటనే తెలుసుకునే అవకాశం ఏర్పడింది అన్నారు. తాను పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఉన్నప్పుడు గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్టు తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల నుంచి వచ్చే పన్నులతోనే కాకుండా ప్రభుత్వాలు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, వాటి అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కేంద్ర గ్రంథాలయం పూర్తిగా పాతబడిందని, దీని స్థానంలో కొత్తది నిర్మించడానికి అధికారులు నడుము బిగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు బహుమతులను టీజీ వెంకటేష్ అందజేశారు. పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, కె.వి.సుబ్బారెడ్డి, మాజీ గ్రంథా లయ చైర్మన్లు చంద్రశేఖర్ కల్కురా, కేజీ గంగాధర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పెద్దక్క పాల్గొన్నారు.

రేపటి పౌరులను నేటి బాల కార్మికులుగా

తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్ : ఎమ్మిగనూరు మండలం ఎస్.నాగలాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఈటీ ఉపాధ్యాయులైన రామాంజనేయులు పిల్లలతో పని చేయించడం జరిగింది. ఈ విషయంపై పీఈటీ టీచర్ రామాంజనేయులును వివరణ అడగగా ఆయన చెప్పే సమాధానం.. మాకు ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ చెప్పడం జరిగిందని చెప్పారు. నేటి బాలలనే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే రేపటి పౌరులను నేటి బాల కార్మికులుగా పిల్లల చేత పని చేయడం చాలా బాధాకరం. విద్యా ర్థులను గోనెసంచుల్లో రాళ్లు తీసేయించడం, చిలకలతో మట్టిని తీయించడం జరుగుతుంది. రేపటి పౌరులను నేటి బాల కార్మికులుగా తీర్చిదిద్దుతున్నారని తల్లిదండ్రు లు వాపోతున్నారు. 14 నుండి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లలను పనిలో ప్రమాదకర పనిలో నియమించి నట్లయితే వారికి ఒక నెల నుండి ఆరు నెలల వరకు జైలు శిక్ష లేదా రూ.20 వేల నుండి రూ.50 వేల వరకు జరిమానా విధించబడుతుంది. బాల్యాన్ని నాశనం చేసే రీతిలో బాలుడు లేక బాలిక పనిచేయడం బాలల శారీరక మానసిక అభివృద్ధికి ఆటంకమై వారిని నాశనం చేయడమే అవుతుంది. బాల కార్మికుల చట్టం 1986లో ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటాం. ఇప్పటికీ ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ఒకటి 21వ శతాబ్దంలోనూ ఈ సమస్య ఇంకా అంతం కావడం లేదు ఎందరో బాలల భవిష్య త్తును చిదిమేస్తున్న కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు అంతర్జాతీయ సమాజం కృషి చేస్తూనే ఉంది. అయిన ప్పటికీ పూర్తిస్థాయిలో ఫలితాలు సాధించడం లేదు. సంబంధిత విద్యాశాఖ అధికారులు పిల్లలు చే పని చేపించిన ఉపాధ్యాయులను సమర్థిస్తారా.. చర్యలు తీసుకుంటారా.. వేచి చూడాలి.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల కేంద్రంలోని గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలను గ్రంథాలయ అధికారిని తోటమ్మ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కాంపిటీషన్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ గిరిజ, ఇరిగేషన్ ఏఈ కర్నూలు రాజు, వెంకటేష్, సాయి ప్రసాద్, హరిసింహ నాయుడు, పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయ భవనంలో 58వ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయాధికారి వెంకటరమణ తెలిపారు. 14వ తారీకు నుండి 20న వరకు జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో చేప ట్టిన వ్యాసరచన, వ్యక్తుత్వ మరియు కథలు తదితర పోటీలు నిర్వ హించగా పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. చివరి రోజున గురు కుల పాఠశాల, హై స్కూల్, స్పెషల్ స్కూల్లోని పలువురు విద్యార్థులకు ఉపాధ్యాయులకు మెమంటోలు బహుమతులను ప్రధానం చేశారు.

నాణ్యమైన భోజనము అందించాలి

విశాలాంధ్ర- చిప్పగిరి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎంతో ప్రతిష్టాత్మకంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకమును అమలు చేయడం జరుగుతుందని దీంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్య కమిటీ చైర్మన్ కొక్క నాగరాజు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ పాఠశాల నందు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకమును పాఠశాల విద్య కమిటీ చైర్మన్ నాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నందు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు తెలిపారు.

గ్రంథాలయాలే దేవాలయాలు

విశాలాంధ్ర- చిప్పగిరి: గ్రామీణ ప్రాంతాలలో గ్రంథాలయాలే దేవాలయాలాంటివని మండల అభివృద్ధి అధికారి అల్లా బకాష్ అన్నారు. గురు వారం గ్రంథాలయాల వారోత్సవ భాగంగా స్థానిక గ్రంథాలయం నందు గ్రంథాలయ నిర్వాహకులు అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమమును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 14 నుండి 20 వరకు రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించడం జరిగిందన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఆటలు పోటీలు, వ్యాసరచనలు నిర్వహించడం జరిగిందని ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను మండల విద్యాధికారులు సావిత్రమ్మ, ఫరూక్లు విద్యార్థులకు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో మండల హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని మండల వీఆర్ఏ సంఘం అధ్యక్షుడు కె.మల్లయ్య డిమాండ్ చేశారు. వీఆర్ఏల సమస్యలు తీర్చాలంటూ గురువారం రిసర్వేడిటీ ముకుందరావుకు వినతి పత్రాన్ని ఇచ్చారు. మల్లయ్య మాట్లాడుతూ వీఆర్ఏ లందరికీ తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని అర్హులైన వీఆర్ఏలను వీఆర్వోలుగా, రికార్డ్ అసిస్టెంట్ లుగా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి నామిని లుగా ఉన్న వారందరినీ వీఆర్ఏలుగా నియమించాలని అటెండర్, వాచ్మెన్ ప్రమోషన్ వర్తిలో వీఆర్ఏలకు 20 శాతం నుండి 70శాతం వరకు పెంచాలని కోరారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని రీ సర్వే పేరుతో ఇతర గ్రామాలను విఆర్ఏ లను నియమించడం తగదని అన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు మల్లయ్య, సిద్ధలింగ, మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని నియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: జాతీయ గ్రంథాలయాన్ని ప్రతి విద్యార్థి వినియోగించుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్క విద్యార్థిపై ఉందని మండల విద్యాశాఖ అధికారి గోపాల్ రెడ్డి సూచించారు. గురువారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి సమక్షంలో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ అక్షరాస్యత, డిజిటల్ లైబ్రరీ గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజ్, శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపల్ హరికృష్ణ, ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, మోహన్ కుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - నందవరం: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 30న జరిగే నమూనా పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో సిఆర్ఆర్ మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, కర్నూలు, హెచ్ఎం టి.వెంకట్ రెడ్డి, సెల్ 9246987024, ఏపీ మోడల్ స్కూల్, నంద్యాల, ప్రిన్సిపల్ మల్లికార్జునప్ప, సెల్. 9491416733, మున్సిపల్ హై స్కూల్, టిజిటి మాథ్స్ ఉపాధ్యాయులు ఎస్. పరశురాముడు, ఆదోని, సెల్. 9154581885 నెంబర్లకు సంప్రదించాలని, విద్యార్థులకు ఆన్లైన్, ఆఫ్లైన్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

మావోయిస్టుల ఎన్కౌంటర్లపై న్యాయ విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర-పత్తికొండ: మావోయిస్టుల ఎన్కౌంటర్లపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్ ఓ ప్రకటనలో గురువారం డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులు హిద్మా, అతని భార్య రాజక్కతో పాటు మావోయిస్టులను ఎన్కౌంటర్ చేయడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ప్రకటించినప్పటికీ కేంద్రం ధమనకాండ కొనసాగించడం గర్హనీయమన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సి ఉండగా, ఎన్కౌంటర్ పేరుతో మావోయిస్టులను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపటాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులపై ఎన్కౌంటర్ల ప్రక్రియను నిలిపివేసి, హింసాత్మక విధానాలు మాని ఇప్పటికైనా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

పట్టా ఉన్న ప్రతి ఒక్కరికి స్థలం చూపిస్తాం

విశాలాంధ్ర- నందవరం: మండలంలోని కె.పేట గ్రామంలోని గతంలో పట్టాలు పొందిన పట్టాదారులందరికి స్థలం చూపిస్తామని ఆర్ఐ రవీంద్ర రెడ్డి అన్నారు. గురువారం కె.పేట గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998లో అప్పటి మంత్రి మోహన్ రెడ్డి 200 మందికి 2.50 సెంట్లు చొప్పున, గత వైకాపా హయంలో 21మందికి 1.50 సెంట్ల ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందని, ఆ స్థలాన్ని జంగల్ క్లీనింగ్ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎవరికీ స్థలాలు చూపించకపోవడంతో గురు వారం గ్రామసభ ఏర్పాటు చేసి, గ్రామ ప్రజల అందరి సమక్షంలో ఇంటి స్థలాలపై విచారణ చేయడం జరిగిందన్నారు. గ్రామ సభ నివేదిక జిల్లా అధికారులకు అంది స్తామని, తర్వాత లబ్ధిదారులకు పట్టా స్థలాలు అందించడం జరుగుతుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు నింపాలి

విశాలాంధ్ర-పత్తికొండ: నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీళ్లు నింపి, పంట పొలాలకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తేర్ బజార్ సర్కిల్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయర్ నుండి కుడి, ఎడమ కాలువ పనులను పూర్తి చేసి 65 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. హొసూర్, బురుజుల, గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి, శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆనంద్ బాబు, నాయకులు రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్, రవిచంద్ర, శ్రీరాములు, భాస్కర్ రెడ్డి, కాశన్న, నరసన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలులో నిర్లక్ష్యం వద్దు

విశాలాంధ్ర-గూడూరు: పత్తి కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం వీడాలని పత్తి మిల్లు యజమాలకు జిల్లా కలెక్టర్ ఎ.సిరి సూచించారు. గురువారం మండలంలోని పెంచికలపాడులో ఉన్న మంజీత్ కాటన్ మిల్లును కలెక్టర్ సందర్శించి రైతులతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ పత్తి రైతులు తేమ శాతం తగ్గించి కాటన్ మిల్లులకు తీసుకురావాలని కోరారు. మిల్లులకు పత్తిని తీసుకొచ్చిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో రైతులను వెనక్కి పంపకూడదని మిల్లు యజమానులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ నారాయణ మూర్తి, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, సీసీఐ అధికారులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ విద్యను నీరుగారుస్తున్న యజమాన్యం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : బీఈడీ కళాశాల అక్రమాలను అరికట్టాలని, బీఈడీ కళాశాలలు అవినీతికి అడ్డగా మారాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ భవనం నందు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలలో ఎన్సీటీఈ, ఉన్నత విద్య మండలి నిబంధనలను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకొని స్థానిక విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకుండా బీఈడీ కళాశాలల యజమాన్యం వ్యవహరిస్తుందన్నారు. తరగతి గదులు విద్యాబోధన లేకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకొని స్థానిక విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వకుండా అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియామ నిబంధనలు ఉల్లంఘించి ఉపాధ్యాయ విద్యను వ్యాపారం చేస్తూ లక్షల రూపాయలు దోచుకుంటున్న బీఈడీ కళాశాలల గుర్తింపులు రద్దుచేసి కళాశాలల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. బీఈడీ కళాశాలల అనుమతులకు సిఫార్సు చేసిన ప్రొఫెసర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి అశోక్, నగర సహాయ కార్యదర్శి మధు, నగర కోశాధికారి నగర నాయకులు జయరాం, ఉదయ్, రాకేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆర్థిక సహకారం అందిద్దాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పత్తికొండ: సహకార సంఘాల ద్వారా రైతులకు ఆర్థికంగా సహకారం అందిద్దామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు దీర్ఘకాలిక రుణాలను అందించాలని, సబ్సిడీపై వ్యవసాయాదారిత పనిముట్లు, ఎరువులు అందించేందుకు కృషి చేయాలన్నారు. పత్తికొండ, మారెళ్ళ, ఉప్పర్లపల్లి, మద్దికేర, బురుజుల, కోయిలకొండ, క్రిష్ణగిరి, వెల్దుర్తి సహకార సంఘాల అధ్యక్షులు చందోలి రంగప్ప, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, అప్ప వేణు, ఆనంద్, ఎర్రిస్వామి, నక్క నాగరాజు, శేషాద్రి, రమాకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలల అక్రమాలను అరికట్టాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఉన్న బీఈడీ కళాశాలలో ఎన్సిటీ, ఉన్నత విద్యా మండలి నిబంధనలను పట్టించుకోకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులను చేర్చుకునే తన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వకుండా వీడియో కళాశాల యాజమాన్యం అన్యమైన అవినీతికి పాల్పడుతుందని, ఇలాంటి సిబ్బందిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కార్యదర్శి షాబీర్ బాష అన్నారు. గురువారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో బీడీ కళాశాలలకు సొంత పవనాలు లేవన్నారు. మరికొన్ని కళాశాలలకు అద్దె భవనాలు లేనందున చిన్నపాటి రూములలో అడ్మిషన్ బ్లాక్ పెట్టుకుని కళాశాలలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేకుండా విద్యార్థులకు ఎలాంటి బ్లాక్ టీచింగ్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారని ప్రశ్నించారు. పట్టణ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ యూనివర్సిటీ అధికారులు ఉన్నత విద్యా మండలి అధికారులు ఆఫీలియేషన్ కమిటీ వచ్చినప్పుడు మాత్రమే ఫ్యాకల్టీని చూపించి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్,శేఖర్,శివ,మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు వద్ద కేబుల్ వైర్ చోరీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామ శివారుల్లో తాగునీటి బోరు వద్ద కేబుల్ వైర్ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుక పోయారు. దీంతో గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మూలింటి లక్ష్మి, వైసీపీ నాయకులు మూకిరెడ్డి మాట్లాడుతూ తాగునీటి బోరు వద్ద పలుమార్లు కేబుల్ వైర్ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకొని పోయారన్నారు. దీనిపై పెద్దకడబూరు పోలీసు స్టేషన్ లో పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ప్రతిసారి తాగునీటి బోరు వద్ద కేబుల్ వైర్ చోరీ జరుగుతూనే ఉందన్నారు. ఇప్పటికైనా పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కేబుల్ వైర్ చోరీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

అక్రమ బంకులను తొలగించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - కోడుమూరు : మండల కేంద్రంలోని జివిఆర్ జడ్పీహెచ్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రహరీ గోడలకు ఆనుకొని ఏర్పాటు చేసిన అక్రమ ప్రైవేట్ బంకులను వెంటనే తొలగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండల ఎంపీడీవో రాముడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడుతూ రెండు బంకుల ఏర్పాటు చేయడం వల్ల పాఠశాలల్లోని ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న సుమారు 1500 మంది విద్యార్థులు రోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలల ముందు వాహనాలతో రోడ్డు రద్దీగా ఉండటంతో విద్యార్థులు వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రహరీకి ఆనుకొని అక్రమంగా వేసిన బంకుల వల్ల విద్యార్థుల రాకపోకలు సక్రమంగా జరగడం లేదన్నారు. బంకుల్లో విక్రయించే బీడీలు, గుట్కా, సిగరెట్ వంటి వాటికీ ఆకర్షితులయ్యే అవకాశాలున్నాయన్నారు. దురలవాట్లకు లోనైయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే అక్రమ బంకుల నిర్మాణాలను తొలగించాలని మండల అధికారులను కోరారు. ఏఐఎస్ఎఫ్ వినతిని పరిశీలించిన ఎంపీడీవో రాముడు, సంబంధిత అధికారి ఈవోఆర్డి మంజులకు మూడు, నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు.ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ఎస్.అల్తాఫ్ బాష, మండల నాయకులు మహేంద్ర, పాండు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించకపోతే మున్సిపల్ అధికారులను ఊడ్చేస్తాం



విశాలాంధ్ర - ఎమ్మిగనూరు రూరల్: పులపాలక సంఘంలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన కార్మికుల పిల్లలకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించక పోతే మున్సిపల్ అధికారులను ఊడ్చేస్తాం అంటూ ఆ కార్మికుల కుటుంబ సభ్యులు తెలిపారు. నాలుగో రోజు దీక్షల సందర్భంగా కాంగ్రెస్ ఇంచార్జ్ ఖాసీం వలి దీక్షను ప్రారంభించి మాట్లాడుతూలి కార్మికులతో పని పని చేయించుకుని, మృతి చెందిన తర్వాత వారి కుటుంబ సభ్యులును రోడ్డు పాలు చేయడం మున్సిపల్ అధికారులకు తగదని, ఇది మంచిది కాదని తక్షణమే వారి కుటుంబ పిల్లలకు ఔట్సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని కాంగ్రెస్ ఇంచార్జ్ ఖాసిం వలి తెలిపారు. అనంతరం కార్మికులతో ఏఐటీయూసీ, ఐఎఫ్టీయూ ఆధ్వర్యంలో దీక్ష శిబిరం నుండి కార్మికులతో ర్యాలీ చేపట్టి సోమప్ప సర్కిల్ నందు వినూత్నంగా మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులు చీపురు చేతబట్టి చెత్తను శుభ్రం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, మున్సిపల్ కార్మిక నాయకులు ఎల్లప్ప,శివ, ప్రతాప్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి విజయేంద్ర, మున్సిపల్ కార్మిక నాయకులు భీమన్న గౌడ్, సల్మాన్, యెహెూనా, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

VASTU HOUSING FINANCE

వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

యూనిట్ 203 & 204, 2 వ అంతస్తు, "ఎ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబై 400015. మహారాష్ట్ర.

సిఐఎన్ సం. : యు65922ఎంహెచ్2005పిఎల్‌సి272501

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం -2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు-2002 నిబంధన 9తో చదివే సెక్షన్ 13(12) కింద అతనికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ అధీకృత అధికారిగా ఈ దిగువ సంతకందారు ఈ కింద పేర్కొన్న రుణగ్రహీతలకు సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజుల్లోగా సంబంధిత నోటీసులో పేర్కొన్న బకాయిలను తిరిగి చెల్లించవలసిందిగా ఈ కింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. రుణగ్రహీతలు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పైన పేర్కొన్న చట్ట నిబంధనల్లో నిబంధనల 9తో చదివే సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తిని దిగువ సంతకందారు ఈ కింద వివరించిన షెడ్యూల్ ఆస్తిని స్వాధీనం చేసుకోవడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని,ఈ ఆస్తితో ఏ ఒప్పందాలైనా ఈ కింద పేర్కొన్న మొత్తం బకాయి మరియు దానిపై వడ్డీ, వ్యయాలు మొదలైనవాటి కొరకు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ బ్రాంచ్ చార్జికి లోబడి వుందునని ప్రత్యేకించి రుణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. నం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత పేరు మరియు లోన్ ఎక్కౌంట్ నం.	డిమాండ్ నోటీసు తేదీ మొత్తం బకాయి	ఆస్తి యొక్క వివరాలు	స్వాధీనత రకం & తేదీ
1	ఎద్దుల శివపార్వతి, ఎద్దుల పాములేటి, HL0000000135618	18-జులై-25 09-జులై-25 నాటికి రూ.437123	నంద్యాల జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, ఆళ్లగడ్డ సబ్ జిల్లా, చాగలమర్రి మండలం, చిన్నబోధానం గ్రామం మజరా, తిప్పనపల్లె గ్రామం, హెచ్.నం.2-40సి, సర్వేనం. 395/1, 111.25 చదరపు గజాల స్థలం. హద్దులు: ఉత్తరం-రోడ్డు, దక్షిణం: కందుల నరసమ్మ స్థలం, తూర్పు: పాసం కామాక్షమ్మ స్థలం, పడమర-యెద్దుల నరసింహుడు కొట్టం	లాంఛన స్వాధీనత స్వాధీనత తేదీ: 14-నవంబరు -2025

తేదీ : 21.11.2025
ప్రదేశము: నంద్యాల

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

పనితీరు మెరుగుపరుచుకోండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : పారిశుద్ధ్య సిబ్బంది తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎస్బీఐ ఎంప్లా యిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులతో అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పురమిత్ర, పీజీఆర్ఎస్, పత్రికల్లో వచ్చే కథనాలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. సామూహిక మరుగు దొడ్ల శుభ్రత రోజువారీగా జరిగేలా చూడాలని, డోర్ టూ డోర్ తడి - పొడి చెత్త సేకరణలో ఎవ్వరూ నిర్లక్ష్యం చేయరాదని స్పష్టం చేశారు. నగర పారిశుద్ధ్య పనులు కొన్ని ప్రాంతాల్లో అధ్వాన స్థితికి చేరుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. కొంత మంది కార్యదర్శులు కార్మికుల మొబైల్ ఆధారిత హాజరును ఎందుకు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. ఎంహెచ్ఓ నాగశివ ప్రసాద్ మాట్లాడుతూ విధుల పట్ల ప్రతి విభాగం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కమిషనర్ పలుమార్లు ఇచ్చిన సూచన లను పాటించకపోవడం విచారకరమన్నారు. ప్రధాన రహదారులు, పాఠశాలలు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాల వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మొండి ట్రేడ్ లైసెన్స్ వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు.

మహారాజశ్రీ డిప్యూటి రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్ కర్నూలు

డిస్ప్యూట్ నెం. 48/2024

మెస్సర్స్ శ్రీ రామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్,
ఆదోని బ్రాంచి. డిస్ప్యూటెంట్

వర్సెస్

ఆర్. జుబేర్ అహమ్మద్ మరియు 3 ఇతరులు

అపోనెంట్స్

అపోనెంట్స్ 1 నుండి 3 గురికి నోటీసులు

1. ఆర్. జుబేర్ అహమ్మద్ తండ్రి ఆర్. నజీర్ అహమ్మద్, ఇం.నెం. 2/202/సి, భేర్‌పేట, ఆదోని.
2. ఇ. జాఫర్ తండ్రి ఇ. ఇబ్రహీం, ఇం.నెం. 2/230 భేర్ పేట, ఆదోని.
3. యం. మహమ్మద్ సయాక్ తండ్రి యం. షరీఫ్ హుస్సేన్, ఫ్లాట్ నెం. 11, యస్‌బిఐ ఫస్ట్ కాలనీ, ఆదోని.
4. యం. ఫయాజ్ బాషా తండ్రి యం. అబ్దుల్ కరీమ్ సాబ్

అపోనెంట్స్

డిస్ప్యూట్ మొత్తం రూ.42,951/- రాబట్టుకొనుటకు మీపైన దాఖలు చేసిన డిస్ప్యూట్ 1 నుండి 4వ అపోనెంట్స్ అయిన మీరు 02.12.2025వ తేదీ రోజున ఉదయం 11::00 గంటలకు మీరుకాని, మీ తరుపు న్యాయవాది ద్వారా కాని హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల సదరు డిస్ప్యూట్ దావా కేసు మీ పరోక్షమున విచారించి, తీర్మాణించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 01.12.2025

బై ఆర్డర్ ఆఫ్ ది డిప్యూటి రిజిష్టర్
ఆఫ్ చిట్స్ / ఆర్బిట్రేటర్
కర్నూలు.

మిత్రుడికి ఆర్థిక సాయం అందజేసిన పూర్వ విద్యార్థులు

విశాలాంధ్ర -గోనెగండ్ల: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ ఎస్ హైస్కూల్ నందు చదువుకున్న 2003 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి స్నేహితుడు గోనెగండ్లలో ఉండే మౌనయ ఆచారి ప్రమాదవశాత్తు కాలు తొడబాగానికి గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న మిత్రులు తమవంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో అందరూ కలిసి అతి కొద్ది సమయంలోనే దాదాపు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుడు మౌనయ ఆచారికి ఇలా జరగడం చాలా బాధాకరమని, ఇలాంటి సమయంలో మేము తనకు అండగా ఉంటామని, తమ మిత్రుడు ఆచారి త్వరగా కోలుకోవాలని వారు కోరారు. ఎంత కష్టం వచ్చినా స్నేహితులంతా కలిసి చెయ్యి వేస్తే ఆ కష్టం అనేది చాలా చిన్నగా అయిపోతుందని, ప్రతి ఒక్కరు ఇలాంటివి సహాయ సహకారాలు చేస్తూ ఉండాలని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మాట్లాడుతూ స్నేహితులు చిన్నప్పుడు సంతోషంగా ఆడుకున్నారు. ఇప్పుడు ఇలాంటి కష్ట సమయంలో వారి మిత్రుడికి సహాయం చేసిన 2003 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో 2003 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుధ నాయుడు, అక్బర్, షఫీ, రఫీక్, మద్దిలేటి, రహుమ్ తుల్లా, పూర్ణ చంద్రరావు, తదితరులు, పాల్గొన్నారు.

నేటి యువత ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తితో రాణించాలి

విశాలాంధ్ర-గడివేముల: నేటి యువత వీర నారి ఝాన్సీ లక్ష్మీబాయి స్ఫూర్తితో రాణించాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. గురువారం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి ఉత్సవాల భాగంగా మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి జ్యోతి ప్రజలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ భారతమాత ఎందరో వీరులను, వీర వనితలను కన్నతల్లి అని, 1857లో ఆంగ్లేయుల పరి పాలన వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీబాయి ప్రముఖ పాత్ర పోషించారన్నారు. స్వరాజ్య రక్షణ కోసం వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి బొబ్బిలిల గర్జించి అసమాన ధైర్య సహసలను ప్రదర్శించి బ్రిటిష్ వారి వెన్నులో వణుకు పుట్టించింది అన్నారు. ఇలాంటి వీరవనితల స్ఫూర్తిదాయకంతో ప్రతి ఒక్క విద్యార్థినిలు, మహిళలు ఉండాలని, మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా బాగా చదువుకుని ఉద్యోగాల్లో రాణించాలన్నారు. 1828 నవంబర్ 19 ఉత్తర భారత రాజ్యమైన వారణాసిలో ఆమె జన్మించిందని ఉత్తర భారత రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి అని తెలిపారు. పరాయి పాలకుల అణిచివేత పై తిరుగుబాటు జరిపి మాతృభూమి స్వాతంత్రం కోసం ప్రాణాల అర్పించడానికి సైతం వెనకాడ లేదన్నారు. వ్యాపారం కోసం వచ్చిన ఆంగ్లేయులు ఈస్ట్ ఇండియా కంపెనీ ద్వారా దేశాన్ని ఆక్రమించుకొని ప్రారంభించారని, ఆంగ్లేయుల పరిపాలన వ్యతిరేకంగా జరిగిన మొదటి స్వతంత్ర సంక్రమంలో బ్రిటిష్ ఆర్మీని గడగడలాడించిన వీర వనిత రాణీ లక్ష్మీబాయి అని వివరించారు. వ్యాసరచన పోటీలలో గెలిచిన విద్యార్థులకు ఎంపీ బైరెడ్డి శబరి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం స్కూల్ యాజమాన్యం, విద్యార్థి సంఘం నాయకులు ఎంపీ బైరెడ్డి శబరిని మెమొంటో ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వర రావు, రాఘవేంద్రరావు, ఆంధ్ర విద్యార్థి సంఘం ఆర్గనైజర్ తురక ప్రసాద్, ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు నాగరాజు, నాగ శంకరుడు, హేమంతు, సుమంతు, టిడిపి నాయకులు జయంత్ రెడ్డి, మంచాలకట్ట భాస్కర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, తుమ్మలేశ్వర్ రెడ్డి, ఎస్ ఏ రఫీక్, కాలిక్ భాషా, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వీడండి

విశాలాంధ్ర - కర్నూలు సీటీ: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సిబ్బందికి హితవు పలికారు. గురువారం ఆయన లక్ష్మి నగర్, మద్దూర్ నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అకస్మిక తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటేషన్ ఇంస్పెక్టర్ చెన్నయతో పాటు ఇద్దరు సానిటేషన్ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులను జాప్యం సహించబోమని, వందశాతం డోర్ టూ డోర్ చెత్తా సేకరణ జరగాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుల వచ్చేంతవరకు ఉండరాదని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షక సిబ్బంది అందుబాటులో ఉంటూ, సత్వరమే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో ప్రజలపై దాడి చేస్తున్న ప్రమాదకరమైన 52 వీధి శునకాలను గార్గేయపురం డంప్ యార్డుకు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగ రాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, కార్పొరేటర్ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - మంత్రాలయం: నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలోని మాధవరం పోలీస్ స్టేషన్‌ని గురువారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పటేల్ తనిఖీ నిర్వహించారు. మొదటగా ఆయన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శించుకున్నారు. అనంతరం మంత్రాలయం స్టేషన్ పరిధిలోని మాధవరం పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటారు. అనంతరం పెండింగ్ కేసులతోపాటు పలు రికా ర్డులను పరిశీలించారు. వీరి వెంట ఎమ్మిగనూర్ డీఎస్పీ భార్గవి, సీఐ గుణ శేఖర్ బాబు, మంత్రాలయం సీఐ పి.రామంజులు, మాధవరం ఎస్ఐ వై.విజయకుమార్ ఉన్నారు.

స్మశాన వాటిలో ముళ్ల కంపలు తొలగింపు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామ శివారులో ఉన్న స్మశాన వాటికలో ముళ్ల కంపలు పెరిగిపోయాయి. దీంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ చంద్రశేఖర్ గురువారం స్మశాన వాటికలో పెరిగిన ముళ్ల కంపలను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ స్మశాన వాటికలో ముళ్ల కంపలను తొలగించామన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేశ భవిత మత్తులేని యువతదే

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ మరియు కళాశాల ఎన్ఎస్ ఎస్ యూనిట ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరా శాంతి అధ్యక్షతన నాషా ముక్త యువ వికసిత్ భరత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎం.ఇందిరా శాంతి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలుగా మారొద్దని, దేశ భవిష్యత్ నేటి యువత పైనే ఆధారపడి ఉందన్నారు. చెడు వ్యసనాలకు లోను కాకుండా ఆరోగ్యకరమైన జీవన శైలి అలవరచుకోవాలన్నారు. డాక్టర్ మోక్షేశ్వరుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ మాట్లాడుతూ అసాంఘిక శక్తులు దేశాన్ని నిర్వీర్యం చేయడానికి యువతను ఆయుధంగా వాడుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డా.ఫక్రున్నిసా బేగం, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకట స్వామి, అధ్యాపకులు, డా.మాదన్న, డా.రోషన్న, డా.సోమశేఖర్, జి.శ్రీనివాస్, ఆది నారాయణ రెడ్డి, డా.వింధ్య వాసినీ దేవి, షాజిదా బీ, డా.జాఫరున్నిసా, నాగ రత్న, హేమలత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు జేవీ సుబ్బరాయుడు,పీడీ దాదాపీర్‌లు తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటిలలో విద్యార్థులు బేస్బాల్, సాఫ్ట్ బాల్ క్రీడాంశం నందు అండర్ 14 అండర్ 17 బాలబాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచి సాఫ్ట్ బాల్ క్రీడలో వెంకటరమణ అండర్ 17కు వెంకట శ్రావణి స్టాండ్ బైవన్ కింద అండర్ 14 బాలికల విభాగంలో పల్లవి, బేస్బాల్ క్రీడాంశం నందు అండర్ 17 బాలుర విభాగంలో భరత్, బాలికల విభాగంలో అనుమోషిత, శివపుష్పలత అండర్ 14 బాలుర విభాగంలో రామ్ చరణ్, బాలికల విభాగంలో పల్లవి స్టాండ్ బై కింద శ్రీదాక్షాయని ఎంపికయ్యారన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యేలా కృషి చేసిన పీడీ దాదాపీరు,విద్యార్థులను హెచ్,ఉపాధ్యా యులు సుబ్రహ్మణ్యం, షాకీర్, లింగమూర్తి, నాగేశ్వర్ రెడ్డి, శుభానంద్ రెడ్డి, సుబ్బలక్ష్మమ్మ, వెంకటేశ్వరిలు అభినందించారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపుకై సర్వే

విశాలాంధ్ర - చాగలమర్రి : గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపుకై సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు అంజలి తెలిపారు. చాగలమర్రి పట్టణంలోని ఆర్సీఎం పాఠశాల సమీపంలో గురువారం సంచార చికిత్సను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి కుష్టువ్యాధి పరీ క్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు మండల వ్యాప్తంగా 24 బృందాలుగా ఏర్పడి అనుమానిత కేసులను గుర్తించి వారికి పరీక్షలు నిర్వహించగా కుష్టు వ్యాధిగ్రస్తుల కాదని, ఎక్కువగా విటమిన్ లోపంతో వచ్చిన మచ్చలను గుర్తించి వారికి మందులు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన నూతన ఏజీపీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా నియమితులైన అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి, అడ్వకేట్ వి.రామచంద్రరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హుస్సేన్ బాష, పీపీ రాజేశ్వర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, గోళ్ళ జయకృష్ణలతో కలసి ఆయన మంత్రి ఫరూక్ ను కలిశారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నూతనంగా ఏజీపీగా నియమితులైన అడ్డగాళ్ల వెంకటేశ్వర్లుకి అభినందనలు తెలుపుతూ విధి నిర్వహణలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అడ్డగాళ్ల వెంకటేశ్వర్లుకు నియామకపత్రాన్ని అందజేశారు. ఎజిపి అడ్డగాళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వహిస్తానని, ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రఘు ప్రకాష్, వైవి రమణారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ నాయకంటి మద్దయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా ముగి శాయి. ఇందులో భాగంగా 14 వ తారీకు నుంచి ఈరోజు వరకు బుక్స్ ఎగ్జిబిషన్, గ్రంథాలయ అవగా హన ర్యాలీ, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించబడ్డాయి. ఆయా పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ఇవ్వబడ్డాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లిడాక్టర్ రెడ్డి ప్రసాద్ రెడ్డిలి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గ్రంథాలయ ఉత్సవాలు లైబ్రేరియన్ డాక్టర్ మద్దయ్య మాదిగ అద్భుతంగా నిర్వహిస్తున్నారని, విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలు పోటీ పరీక్షల పుస్తకాలు మొదలు వాటిని ఉపయోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షలకు పుస్తకాలు నిరంతరం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు డాక్టర్ నాయకంటి మద్దయ్య మాదిగ మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథ పఠనం గ్రంథాలయాలకు నిరంతరం ఉపయోగించుకునే ఉద్దేశంతోనే ప్రతి సంవత్సరం కళాశాల గ్రంథాలయం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకొని మంచి విజ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి మంచి ఉన్నత స్థితికి చేరాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలతో సుస్థిరమైన జీవనోపాదులు మెరుగుపరచుకోవాలి : డీఆర్డీఏ

విశాలాంధ్ర-పాణ్యం : పొదుపు రుణాలతో మహిళలు సుస్థిరమైన జీవనోపాదులు మెరుగుపరచుకోవాలని డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వము ఏ విధంగా అయితే ప్రతి కుటుంబం ఒక జీవనోపాధి కలిగి ఉండాలి అనేటువంటి ఉద్దేశంతో ముందుకు వెళ్తుందో ఆ విధానంలో భాగంగానే మహిళా సంఘ సభ్యులు జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు పాణ్యం గ్రామంలో మహాలక్ష్మి అనే మహిళ పీఎంఈజీపి పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్న కంప్యూ టర్ ఎంబ్రాయిడరీ మిషన్ గురువారం జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి ప్రారంభించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలైన ఉద్దేశ్యముతో వారు సుస్థిర ఆదాయం సంపాదించాలనే ఉద్దేశంతో జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవడం అన్నది చాలా ప్రాముఖ్యమైన విషయం. మండలంలో ఆసక్తి ఉన్న మహిళలందరికీ పీఎంఎఫ్ ఎంఈ, పిఎంఈజీపి పథకాల ద్వారా రుణాలు అందించి వారు సుస్థిరమైనటువంటి జీవనోపాదులు ఏర్పాటుఆసక్తి ఉన్న మహిళలందరికీ పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపి పథకాల ద్వారా రుణాలు అందించి వారు సుస్థిరమైన జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవడమన్న చాలా గర్వించదగ్గ విషయము. ఎందుకంటే ప్రభుత్వం ఏ విధంగా అయితే ప్రతి మహిళను లక్షాధికారినీ చేయాలనే ఉద్దేశ్యంతో పనిచేస్తుందో, ఆ ఉద్దేశాన్ని నెరవేర్చుటలో భాగంగా పొదుపు సంఘాల్లో ఉన్నటువంటి మహిళలందరినీ వారి జీవనోపాదులను మెరుగు పరచు కునే విధంగా ప్రతి మహిళను లక్షాధికారి నీ చేయాలనే ఉద్దేశ్యంతో పని చేస్తుందో ఆ ఉద్దేశాన్ని నెరవేర్చుటలో భాగంగా పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలందరినీ వారి జీవనోపాదులను మెరుగుపరుచుకొనుటకు వారికి ఆసక్తి ఉన్న రంగంలో తగిన శిక్షణను ఇప్పించి, కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం జరుగుతుంది. పాణ్యం ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా లేదా ప్రభుత్వ సంస్థల ద్వారా రుణాలు ఇప్పిచ్చి వారిని చిన్నచిన్న పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందని, ఈరోజు అనుపూరు గ్రామములో మహిళ ఈ ఏర్పాటు చేసుకున్న మిషన్ ద్వారా తన కుటుంబాన్ని పోషించుకోవడమే కాక కుటుంబానికి ఒక ఆదాయ వనరుగా ఉండాలని తెలిపారు. ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఇంకా సంఘాల్లో ఉన్న అనేకమంది మహిళలని గుర్తించి, వారికి వారి వ్యాపార అభివృద్ధిని మెరుగు పరుచుటకు అనేక పథకాల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమక అధ్యక్షులు సీసీలు, సిబ్బంది వివోఏలు హాజరు కావడం జరిగింది.

విద్యార్థులకు బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక భారతి విద్యా మందిరం లోని విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి రామచంద్రుడు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంతారావు, నాగేంద్ర, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి నిరు ద్యోగులు, ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీలకు రుణాలు మంజూరు మంజూరు చేసి వారికి స్వయం ఉపాధి కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల నాయ కులు ప్రభుత్వాన్ని కోరారు. గురు వారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వరప్రసాద్ కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేసి ఎక్కువమంది యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని వారు కోరారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన నంద్యాల ఐఎంఏ బృందం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల ఐఎంఏ నూతన కార్యవర్గం రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల ఐఎంఏలో 500 మంది వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నారని, సామాజిక సేవలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు సేవ చేస్తున్నారని అభినందించారు. నూతన కార్యవర్గంమంచి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ గత ఐఎంఎ చేసిన కార్యక్రమాలకు రాష్ట్రంలో ఉత్తమ పురస్కారం, ఉత్తమ మహిళా వైద్య విభాగ సామాజిక సేవా పురస్కారంతో పాటు డాక్టర్ మధుసూదనరావుకు ఉత్తమ అధ్యక్షుడు పురస్కారం ప్రకటించారని 22వ తేదీ రాజంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఐఎంఎ సదస్సులో ఈ పురస్కారాలు అందిస్తారని మంత్రికి వివరించారు. మంత్రి ఫరూక్‌ను శాలువా, గజమాలతో వైద్యులు సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ నూతన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ రఫీ, మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, డాక్టర్ ఆరిఫాభాను తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ మహీంద్రా పూల్ క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : రాయలసీమ ప్రాంతం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను మరింతగా విస్తరించే లక్ష్యంతో, కర్నూలు అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రా ఆధ్వర్యంలో రెండు రోజుల పూల్ క్యాంపస్ డ్రైవ్ విజయవంతంగా నిర్వహించబడింది. రాయల సీమలోని ప్రముఖ కాలేజీల నుంచి మొత్తం 1327 మంది విద్యార్థులు ఈ డ్రైవ్లో పాల్గొనడం విశేషం.ఈ డ్రైవ్లో అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎస్ఆర్ఐటీ అనంతపురం, సెంట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల, ఏమ్మిగనూరు వంటి విద్యాసంస్థల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రాథమికంగా రెండు రౌండ్లు పూర్తి కాగా, అర్హత పొందిన విద్యార్థులకు త్వరలోనే ఫైనల్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టెక్ మహీంద్రా ప్రతినిధులు వెల్లడించారు. ఈ నియామక కార్యక్రమానికి టెక్ మహీంద్రా హెచ్‌ఆర్ జాని బేగమ్, ఆమె బృందం హాజరై ఎంపిక ప్రక్రియను సజావుగా నిర్వహించారు. విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు, ప్రవర్తన, ఆత్మవిశ్వాసం చూసి ప్రశంసలు అందించటం జరిగింది.అశోక మహిళా ఇంజినీరింగ్ కళాశాల మహిళలను సాంకేతిక రంగంలో ముందుకు నడిపించేందుకు నాణ్యమైన విద్య, ట్రైనింగ్స్, ప్లేస్మెంట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ కార్యక్రమం రాయలసీమలో పరిశ్రమ-విద్యా సంస్థల అనుసంధానానికి అశోక కళాశాల చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచింది. కళాశాల సీఈఓ డా.హారిస్ కృష్ణ మాట్లాడుతూ మా లక్ష్యం విద్యార్థులకు చదువు మాత్రమే కాదు, ఉద్యోగం అందేలా దారులు తెరవడం. రాబోయే రోజుల్లో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించి, ప్రాంతీయ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అధ్యాపకులు, ప్లేస్మెంట్ కోఆర్డినేటర్లు, వాలంటీర్లు, విద్యార్థి ప్రతినిధులు కీలకపాత్ర పోషించారు.

గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తాం

విశాలాంధ్ర - హొళగుంద: గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తామని మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గురు వారం ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు చిదానంద, గ్రంథాలయ అధికారి ఎం దేవేంద్ర బహుమతులను పంపిణీ చేశారు మండల టీడీపీ కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య మాట్లాడుతూ గ్రంథాలయ భవనం నిర్మాణానికి స్థలం కొరత ఉన్నదన్నారు. సంత మార్కెట్లో, వేరే ఎక్కడ స్థలం ఉన్నచోట భవనం నిర్మాణానికి ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జీ వైకుంఠం జ్యోతి, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ ఆధ్వర్యంలో భవన నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ డాక్టర్ తిప్పయ్య, రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు చిదానంద, సిబ్బంది నాగరాజు, సిహెచ్ఓ చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-గూడూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్ఆర్సిపి నేతలు, శ్రేణులు గూడూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం పట్టణంలోని బస్టాండ్‌లో వైసీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోడుమూరు నియోజవర్గ బాధ్యుడు ఆదిమూలపు సతీష్, మున్సిపల్ చైర్మన్ జూలపాల వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆదిములపు సతీష్ మాట్లాడుతూ వైద్య విద్యను పేద విద్యార్థులకు దూరం చేసేందుకే చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీక రణకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు జులుపల ఆబెల్, కౌన్సిలర్లు కుమార్, ఖలీల్, మద్దిలేటి, వైసీపీ నేతలు వాల్మీకి పట్టణ ఉపాధ్యక్షులు గిద్దయ్య, పత్తిరంగడు, చను గౌండ్ల దౌల, మహేశ్వర్ రెడ్డి, రామచంద్ర, మాథస్వామి, పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మాల కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఆదోని నియోజకవర్గ మాల మహానాడు గౌరవాధ్యక్షుడు కుంకనూరు వీరేష్ సూచించారు. గురువారం పట్టణంలోని ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల మైదానం వెనక ఉన్న శ్రీబావాజీ మఠంలో మాల కుల బంధువుల 8వ వార్షికోత్సవ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదోని నియోజకవర్గ మాల మహానాడు గౌరవ అధ్యక్షుడు కుంకనూరు వీరేష్,మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు వైపీ గంగాధర్ మాట్లాడుతూ మాల కులస్తులు ఐక్యమత్యంగా ఉంటూ ఒకరికి ఒకరు సాయ సహకారాలు చేసుకుంటూ కుటుంబాల అభివృద్ధికి సహకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చిన్నహోతూరు గంగన్న, బ్యాగారి శ్రీనివాసులు, గ్యగారి గణేష్, కేజీ మురళి, కుంకానూరు నవీన్ ప్రశాంత్, ఫొటో గ్రాఫర్ కృష్ణ, తిక్కన్న, నరేష్, సాయిరాం, బుదురు శ్రీనివాసులు కుల పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.